# గోడకి కొట్టిన బంతి

దోనేపూడి ప్రేమ్‌దులారి

నలభై ఏళ్ళకే ముసలివాడినైపోయినట్లు అనిపిస్తోంది సహదేవరావుకి.

నిజమే మరి పువ్వులమ్మినచోట కట్టెలమ్ముకుంటే అలాగే అనిపిస్తుంది. పదేళ్ళక్రితం ఇదే హైదరాబాదులో సహదేవరావు కారులోతప్ప బయటికి వచ్చేవాడు కాదు. సైరన్‌తో తన కారు ముందుకు దూసుకుపోతుంటే వెనక ముందు కూడా ఎస్కార్ట్ కార్స్ పోతుండేవి. ఎంత రద్దీగా వున్నా సైరన్ వినిపించగానే ట్రాఫిక్ కానిస్టేబుల్స్ అలర్ట్ అయిపోయేవారు. మిగతా వాహనాల్ని ప్రక్కకి తొలగి వెళ్ళమని హడావుడి చేసేవారు- మధ్య నుంచి తన కారు ఎస్కార్ట్‌లతో దూసుకుపోతుండేది. అలాంటిది ఇప్పుడు తనకి అద్దెకారు మీద చాలామందిలా తిరిగే తాహతు లేదు.

అప్పుడు మినిష్టరయితే ఇప్పుడో సాధారణ పౌరుడు!

పదేళ్ళలో ఎంత మార్పు!!

ఆరోజుల్లో తన జీవితం ఇలా అవుతుందని ఎప్పుడైనా అనుకున్నాడా? ఆ హోదా, హంగులు శాశ్వతం అనుకున్నాడు! అందుకే తనకంటూ జాగ్రత్త పడాలన్న ధ్యాసే లేకపోయింది.

ఆ రోజుల్ని తలుచుకుంటూ చింతించడం ఈరోజు దినచర్య అయింది సహదేవరావుకి.

పదవిలో వున్నన్నాళ్ళూ చుట్టూ జనం, ఎక్కడికిపోయినా కోలాహలం!

నైట్ స్టే వుందంటే చాలు ఆ వూళ్ళో ఛోటా నాయకులు ఎంత హడావుడి చేసేవారు! ప్రజలకి కనిపించేటట్లు చేసే హడావిడి కొంతైతే, ఎవ్వరికీ తెలీకుండా చేసే హడావిడి మరికొంత!! సభలు, సమావేశాలు ఆర్భాటంగా చేసేవైతే- తిరిగి తిరిగి గెస్ట్‌హౌస్‌కి చేరుకునేసరికి రహస్యంగా మందు, మగువ!!

మంత్రిగా వున్నప్పుడు తను ఎన్ని ఊర్లు తిరిగాడు..ఎంత వెరైటీ ఆనందాల్ని చవిచూశాడు.

ఆరోజులు గుర్తుకొస్తేనే ఒకవిధమైన ఆనందంతో బాధతో కొట్టుకుపోతుంది సహదేవరావు మనసు.

పదవి పోగానే ఒక్కసారి ఒడ్డునపడ్డ చేపలాగైపోయింది పరిస్థితి. మంత్రించినట్లు జనాలు మాయమైపోయారు. అంతకుముందు ఎప్పుడూ జనంతో కిటకిటలాడిపోయే క్వార్టర్ నిర్మానుష్యమైపోయింది. నిన్నటిదాకా అడుగులకు మడుగులొత్తిన సహదేవరావు సేవకులెవ్వరూ అటు ఛాయలకు కూడా రావడం మానుకున్నారు. ప్రభుత్వ డ్రైవర్‌తోపాటు కారు కొత్త మినిష్టర్ గారింటికి తరలిపోయింది. బలవంతాన ఆ క్వార్టరూ ఖాళీ చేయించారు సహదేవరావుని.

ఇక తప్పక స్వంత నియోజకవర్గానికి పోవలసిన పరిస్థితి...అక్కడికెళ్తే ఎవ్వరూ అతడిని చూడడానికి రాలేదు. కారణం అతడు పదవిలో వున్నప్పుడు స్వంత నియోజకవర్గ సభ్యులెవ్వరికీ సాయం చేయకపోవడమే. టూర్స్ కూడా అతను సాధ్యమైనంత వరకూ తన నియోజకవర్గాన్ని వదలి వేరే వేరే ప్రాంతాలకి వెళ్ళడమే.

పెళ్ళాం ఎవడితోనైనా లేచిపోయి ఎదిరింట్లో కాపురం పెట్టినా పర్లేదుగాని, పదవి లేకపోతే వుండలేనని ఏదో సినిమాలో నాగభూషణం చెప్పిన మాటలు అతనికి గుర్తురాలేదు- అతనా సినిమాని చూడలేదు కాబట్టి. కానీ అతని పరిస్థితి అదే! అందుకే తిరిగి పదవిని సంపాదించుకోవాలనే తపనతో మంత్రిగా సంపాదించుకున్నదేకాక అంతకుముందు సంపాదించుకున్నదీ తగలేశాడు.

**మంత్రిగా వున్నప్పుడు తను ఎన్ని ఊర్లు తిరిగాడు..ఎంత వెరైటీ ఆనందాల్ని చవిచూశాడు. ఆరోజులు గుర్తుకొస్తేనే ఒకవిధమైన ఆనందంతో బాధతో కొట్టుకుపోతుంది సహదేవరావు మనసు.**

ఆస్తంతా హారతి కర్పూరమై పోయిందిగానీ, మంత్రి పదవిని మళ్ళీ సంపాదించుకోలేకపోయాడు సహదేవరావు. ఆ ఊళ్లోనూ వుండలేకపోయాడు. దాంతో మకాం హైదరాబాదుకి మారిపోయింది.

అక్కడా అతని మాటల్ని, అతణ్ణి నమ్మేవాళ్ళు కరువైపోయారు. ఇబ్బంది లేకుండా గడవడమే కష్టమైపోయింది. సరిగా ఆ సమయంలో సహదేవరావుకి కాకినాడలో వున్న అజయ్‌కుమార్ గుర్తుకొచ్చాడు.

తను మంత్రిగా వున్నప్పుడు అతనికి ఎంత సాయం చేసాడు! తన పలుకుబడితో అతను లక్షలు సంపాదించాడు. ఆ కృతజ్ఞతతోనే కాకినాడ ఆహ్వానించి, వెళ్ళినపుడల్లా ఎంతగా తృప్తిపరిచేవాడు. అసలు ఆడదానిలో అంత ఆకర్షణ వుందని తనకి తెలియజెప్పినవాడతనే!!

ఆరోజు గుర్తుకు రాగానే సహదేవరావు బుగ్గలు ఎర్రబడ్డాయి.

గ్లాసమీద గ్లాస-

గుర్రం ఎక్కి- బ్రహ్మాండంగా స్వారీ చేస్తున్నాడు. పానకంలో పుడకలా అజయ్‌కుమార్ తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు.

కోపంతో తన భృకుటి ముడిపడింది.

వంటరిగా తాగడం తనకిష్టం. తనాగదిలోకి వచ్చేముందే అన్నీ సర్దేసి వుంచాలి. తాగుతున్నప్పుడు ఎవ్వరూ అటుగా రాకూడదు. వస్తే భరించలేడు తను.

''మంత్రిగారికి కోపం తెప్పించడం నా అభిమతం కాదు..తమకో విషయాన్ని మనవి చేసుకోవాలని...'' నసిగాడు అజయ్.

''అందుకు ఇదా సమయం!'' గద్దించాడు తను.


''ఇందుకిదే మంచి సమయమండీ. ఈవిడ పేరు రజని...ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పిస్తే జీవితాంతం తమ పేరు చెప్పుకొని బ్రతుకుతుంది..తల్లి తండ్రి లేరు. మీరే దిక్కు'' ఒకడుగు బయటికి వేసి ఓ పాతికేళ్ళ యువతిని లోపలికి లాగాడు.

చటుక్కున అతడి చేతిని విదిలించుకుని తనవైపు చూసి హస్తాల్ని ముకుళించిందామె.

అరవిచ్చిన గులాబిలా వున్న ఆమెని చూడగానే ఒక్కసారి మత్తు దిగినట్లనిపించింది. చేయి ఖాళీ గ్లాస్‌ని ఎదురుగా వున్న టేబుల్ మీద పెట్టేసినా చూపులు ఆమె మీద నుండి మందు సీసావైపు తిరగడం లేదు!

నరాలు జివ్వున లాగుతున్నాయి.

''మీరు ఉద్యోగమిచ్చి సాయం చేసేరంటే ఆమె మీ



రుణం
వుంచుకోదు. అందుకే అడ్వాన్స్‌గా మీకు సమర్పించుకోవాలని వచ్చింది'' ఒక వెకిలి నవ్వు నవ్వి తలుపువేసి వెళ్ళిపోయాడు అజయ్.

ఒక్క క్షణం దిమ్మెరపోయినట్లనిపించింది తనకి. ఇంత అందం తనకోసం అర్రులు చాస్తోంది!

వెర్రిగా కుర్చీలోంచి లేచాడు.

ఆమె అలా అక్కడే నిల్చునుంది.

దగ్గరకి వెళ్ళాడు. వణుకుతున్న చేతుల్తో ఆమె చుబుకాన్ని పైకెత్తాడు.

కళ్ళవెంట ధారగా నీళ్ళు..!

తన మత్తు పూర్తిగా దిగిపోయింది.

ఆప్యాయంగా ఆమెని పొదివి పట్టుకుని మంచం మీద తన సరసన కూర్చోబెట్టుకున్నాడు.

''ఛీ పిచ్చిదానా...ఎందుకా కన్నీళ్ళు? రేపీపాటికల్లా నిన్నో మంచి ఉద్యోగినిని చెయ్యనూ?'' కళ్ళనీళ్ళు తుడుస్తూ చటుక్కున ఆమెని దగ్గరకు లాక్కున్నాడు.

ఆ రాత్రి ఆమె చూపించిన స్వర్గాన్ని తనెలా మరచిపోగలడు?

అందుకే ఆ మర్నాడు ''ఆమె బయోడేటా తెచ్చావా?'' అని అడిగాడు అజయ్‌కుమార్ని.

''ఆవిడ సంగతి తర్వాత మంత్రిగారు, ముందా అందాల్ని తమకు సమర్పించుకున్న ఈ దాసుణ్ణే కనికరించాలి'' ఓ వెకిలినవ్వు నవ్వాడు అజయ్.

అతని
బావమరిది మీదున్న మర్డర్ కేసు మాఫీ అయిపోయింది గాని ఆమె అప్లికేషన్ రాలేదు. న్యాయం లాగానే అజయ్‌కుమార్ చేతుల్లో నలిగిపోయింది. కారణం ఆమె మంత్రిగారికిచ్చిన విందు తనకివ్వడానికి నిరాకరించడమే!

అప్పటినుంచీ ఏ పట్టణంలో కాంప్ చేసినా మంత్రిగారికి జుర్రుకోవడానికి మందుతోపాటు మగువా తప్పనిసరి! ఆ తర్వాత ఎంతమంది పొందు జూసినా మొదటి అనుభవం మనసులో భద్రంగా అలాగేవుంది.

అజయ్‌కుమార్ గుర్తుకురాగానే ఆమె గుర్తుకొచ్చింది సహదేవరావుకి.

కాకినాడ బయల్దేరాడు.

తన
నించి ఎంతో సాయాన్ని పొందిన అజయ్ తనకండగా నిల్వబోతాడాని ఒక ఆలోచన.

ఆమెని ఎక్కడున్నా ఒక్కసారి చూడాలని మరో ఆలోచన!

కాకినాడలో రైలు దిగి, తన సూట్‌కేస్‌ని మోసుకుంటూ బయటికొచ్చాడు.

రిక్షా మాట్లాడుకుని అజయ్‌కుమారింటికి బయల్దేరాడు.

అప్పుడు తనొచ్చినప్పుడు చుట్టూ జనం...ఈరోజు తనని గుర్తుపట్టే మనిషే లేడు. ఆరోజు తనకోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాసిన అజయ్, ఈరోజు అతనిసాయం కోసం బయల్దేరాడు తను..కాకపోతే అప్పుడు, ఇప్పుడూ ఒకటిగానే

వున్నది తన జేబు. ఆరోజు జేబులో పైసా లేదు. ఇప్పుడు కొద్దిగా చిల్లరుంది. ఆరోజు జేబులో పైసా లేకపోయినా ఫికరు లేదు. తన నోటి వెంట మాటరావడం ఆలస్యం క్షణాల్లో ఆ వస్తువు తన దగ్గరికి వచ్చేసేది. ఈరోజు జేబు ఖాళీ. ఉన్న పైసలు టికెట్టు కొనడానికి దారి ఖర్చులకు సరిపోయింది. తిరిగి వెళ్ళడానికి ఛార్జీలు లేవు. అజయ్‌కుమారే ఆ విషయం చూసుకుంటాడని ధైర్యంగా వచ్చేసాడు.

ఆలోచనలమధ్య రిక్షా ఓ పెద్ద బంగళా ముందాగింది. జేబులో చిల్లరంతటినీ అతనికిచ్చేసి సూట్‌కేసందుకున్నాడు సహదేవరావు.

''రైరో..కౌన్ హై తుమ్..''గుర్ఖా గేటు దగ్గరే నిలేశాడు.

సహదేవరావుకి కోపంతో వళ్ళు మండిపోయింది.

''సాబ్ కో బోలో..మై సహదేవరావ్..ఎక్స్ మినిస్టర్..'' కోపాన్ని అణుచుకుంటూ తన దర్పాన్ని గుర్ఖాముందు ప్రదర్శించాడు సహదేవరావు.

గుర్ఖా గేటు లోపల గడియపెట్టి బంగ్లాలోకి వెళ్ళాడు.

సెకండ్లు నిముషాలుగా మారుతున్నాయి.

సహదేవరావులో అసహనం పెరుగుతోంది.

''సాబ్ బహుత్ బిజీ..కల్ ఆవ్ బోలే''

ఈ మాటలు సహదేవరావు నెత్తిన పిడుగుల్ని కురిపించాయి. గూర్ఖామీద కోపమంతా అజయ్ కుమార్ మీదకి మళ్ళింది. బహుశా ఎదురుగా అజయ్‌కుమార్ వుంటే మింగేసేవాడేమో! అంతకు ముందు వాళ్ళిచ్చిన విలువ, గౌరవం తనకి కాదు, తన పదవికని గుర్తించని ఆ అమాయకుడు కోపంతో కుతకుతలాడసాగాడు.

ఇంతలో లోపలినుంచి ఓ మారుతీకారు గేటువేపు దూసుకొచ్చింది.

గుర్ఖా గేటుని తెరిచి సెల్యూట్ చేశాడు.

కారుతోపాటు అజయ్‌కుమార్ కూడా కనుమరుగైపోయిన తర్వాత గాని సహదేవరావు తేరుకో లేదు. కళ్ళు తిరుగుతున్నట్లనిపించ సాగింది. అయినా అక్కడ నిలువ బుద్ధికాలేదు. నెమ్మదిగా ముందుకు బయల్దేరాడు.

ఎంతదూరం నడిచాడో ఎప్పుడు కళ్ళు తిరిగి పడ్డాడో కూడా అతనికి తెలీదు.

తెలిసేసరికి ఓ పాకలో కుక్కి మంచంలో పడుకొనున్నాడు.

తననక్కడికి చేర్చి సపర్యలు చేసిన వ్యక్తివరాని అతని కళ్ళు వెదకసాగాయి.

స్పృహలోకి వచ్చాడని గ్రహించగానే ఆమె స్పూన్‌తో కొద్ది కొద్దిగా పాలని అతని నోట్లో పోయడం ప్రారంభించింది.

కొద్ది కొద్దిగా తెరుచుకున్న అతని కళ్ళు ఆమెని చూడగానే నిలబడిపోయాయి. గొంతులోని పాలు బళుక్కున బయటికొచ్చేశాయి.

''మీరు...మీరు'' సన్నగా గొణిగాడు.

''అవును! నేనే! ఆరోజు మీరు ఉద్యోగమిప్పిస్తారనే ఆశతో నా సర్వస్వాన్ని మీకు అర్పించిన రజనిని!'' ఆమె కంఠంలో కోపం లేదు, ఒకవిధమైన నిరాశ, నిస్పృహలున్నాయి.

సహదేవరావు బిక్కచచ్చిపోయాడు.

తనవల్ల సాయం పొందినవాళ్ళు తన ముఖం కూడా చూడకపోతే- సమస్తాన్ని కోల్పోయిన ఈమె గొప్ప హృదయంతో ప్రాణభిక్ష పెట్టింది. తనకెందుకని ఈమె వూరుకొని వుంటే తన ప్రాణాలీపాటికి అనంతవాయువుల్లో కలిసిపోయి వుండేవి.

సిగ్గుతో కృంగిపోయాడు సహదేవరావు.

ఆమె తనని పట్టించుకోకుండా వుంటే ఇంతకన్నా బాగుండేదేమో! నాశనం చేసినవాడికి ప్రాణాలు పోసే క్షమాగుణంతో కుచించుకుపోయేట్లు చేస్తోంది.

సహదేవరావుకి మనసుని మెలిపెట్టినట్లు బాధగా వుంది.

''నువ్వు..మీరు..'' మరి మాట్లాడలేకపోయాడు సహదేవరావు.

''ఓ ఎలిమెంటరీ స్కూల్లో టీచర్గా పనిచేస్తున్నాను'' ఆమె జవాబు.

''మీ ఆయన...'' చుట్టూ చూస్తూ అడిగాడు.

''హు..మా ఆయన..ఒకళ్ళ దగ్గర సర్వస్వాన్ని పోగొట్టుకుని మరొకరి భార్యగా ఎలా జీవించ గలను?'' ఆమె అడిగిన ప్రశ్న సూటిగా అతడి గుండెలకి తగిలింది. ఛెళ్ళున చరిచినట్లయింది సహదేవరావుకి.

ఆమెకి, తనకి ఎంత తేడా?

ఆ ఐరావత పర్వతం ముందు తను నిలబడలేడు.

ఓపికనంతటినీ కూడదీసుకుని మంచం మీద నుంచి లేచాడు.

''పాక బయట ఆడుకుంటున్నాడే వాడే, ఆరోజు మీరు ఉద్యోగాన్నివ్వకుండా నాకంటగట్టిన మూల్యం...''

పాక బయట కడుగుపెడుతున్న సహదేవరావు కళ్ళు ఆ మాటలు వినగానే అక్కడాడుకుంటున్న పిల్లవాడివైపు మళ్ళాయి.

ఎనిమిది, తొమ్మిదేళ్ళుంటాయి.

సరిగా తన చిన్నప్పటి ఫోటోలా వున్న ఆ కుర్రవాణ్ణి కన్నార్పకుండా చూస్తూ నిల్చుండిపోయాడు సహదేవరావు.

అతని మనసులో ఎన్నో ఆలోచనలు...

వీడు..వీడు..నా కొడుకు!

చటుక్కున వెనక్కి తిరిగి రజని మెడ వంక చూశాడు సహదేవరావు.

బోసిగా వుండి చెప్పకనే ఎన్నో విషయాల్ని చెప్పింది.

ఆవేశంతో ఆమె వైపు రెండడుగులు వేశాడు.


''ఆగు...మరో అడుగు ముందుకు వేశావో మర్యాదగా వుండదు. రోడ్డుమీద కళ్ళు తిరిగి పడిపోయిన ఓ మనిషికి సపర్యలు చేసింది మానవత్వంతో, మొగుడని కాదు'' మాటల్ని ఛెర్నాకోలులా ఝుళిపించడమంటే ఏమిటో సహదేవరావుకి అప్పుడే అనుభవంలోకి వచ్చింది.

తనకి అజయ్‌కుమార్ చూపించింది అవిశ్వాసమైతే, తను ఈవిడకి చూపించిందేమిటి? అతడి మనసు అతడిని నిలదీసింది.

దాంతో అక్కడ నిలబడలేక ముందుకి కదిలాడు సహదేవరావు.

''మీరు వెళ్ళడానికి ఛార్జీ'' ఆమె ఇచ్చిన పైసల్ని ముఖమెత్తకుండానే అందుకుని గబగబా అడుగులు వేయసాగాడు సహదేవరావు. ఆ కుర్రవాడు ఆడుకుంటూ గోడకి కొట్టిన బంతి తిరిగొచ్చి సహదేవరావు ముఖానికి కొట్టు కుంది.

★



ముగ్గు-ఆర్. తారా బాలకృష్ణ (హైదరాబాద్)